www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 29 మార్చి 2025

## 1న ఒంటిమిట్టలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**ప్రజాశక్తి-ఒంటిమిట్ట :** ఒంటిమిట్ట ఏకశిలానగరంలోని శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించనున్నారు. ఏప్రిల్ 5 నుంచి 15వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అర్చన నిర్వహించి, ఉదయం 8 నుండి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడతారు. ఈ నేపథ్యంలో గర్భాలయం, శ్రీఆంజనేయస్వామి, శ్రీగరుత్మంతుని సన్నిధి, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేస్తారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం భక్తులను ఉదయం 11.30 గంటల నుండి సర్వదర్శనానికి అనుమతిస్తారు. శ్రీ కోదండరామ స్వామి వారి ఆలయాన్ని ఎపి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ నుంచి 2015 సెప్టెంబర్ 9న టిటిడిలోకి విలీనం చేసుకుంది. ఈ ఏడాది శ్రీ కోదండరామ స్వామి వారి ఆలయంలో అంకురార్పణ నుంచి శ్రీపుష్పయాగం వరకు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు టిటిడి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు.

# స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

### - ధర్నాలో సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

జగన్ పోయి బాబు వచ్చినా విద్యుత్ కష్టాలు తప్పలేదని, స్మార్ట్ మీటర్లను పెడితే పగలగొడతానని ఎన్నికలకు ముందు మంత్రి నారా లోకేష్ చెప్పారని, గెలిచిన తర్వాత మంగళగిరిలో స్మార్ట్ మీటర్లు బిగిస్తుంటే నిద్రపోతున్నారా అని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు ప్రశ్నించారు. సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం ట్రూ అప్ ఛార్జీలు, సర్దుబాటు, ఇతర సుంకాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఇఇ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీలు, సెకి ఒప్పందాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పి.శ్రీనివాసులు మాట్లాడుతూ టిడిపి అధికారం లేనప్పుడు వైసిపి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచితే, టిడిపి అధికారంలోకి వస్తే తగ్గిస్తామని చెప్పిన మాటలకు పొంతన లేకుండా టిడిపి నాయకులు మాట్లాడుతున్నారని విమర్శించారు. విద్యుత్ వాడిన బిల్లు కన్నా ఇతర ఛార్జీలే ఎక్కువగా ఉంటున్నాయని విమర్శించారు. వైసిపి ఐదేళ్ళ పాలనలో రూ.35 వేల కోట్లు విద్యుత్ ఛార్జీలు పెంచితే, కూటమి ప్రభుత్వ తొమ్మిది నెలల కాలంలోనే రూ.15 వేల కోట్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ ఛార్జీలను 9 సార్లు వైసిపి ప్రభుత్వం పెంచినందు వలన బాదుడే బాదుడు అనే నినాదంతో టిడిపి ప్రజల్లో ప్రచారం చేసి, టిడిపిని గెలిపిస్తే తగ్గిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారని, ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రస్తుతం వేల కోట్ల రూపాయలు విద్యుత్ ఛార్జీలు పెంచారని విమర్శించారు. వెంటనే స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపసంహరించుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సెకితో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.హరిశర్మ, ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, రాజబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

# ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

### - రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

అర్జీదారులతో మాట్లాడతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

**ప్రజాశక్తి-చిన్నమండెం**

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళుతుందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు నిరంతరం ప్రజాసేవకే అంకితమై ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వల్ల ప్రజలు పలు సమస్యలతో నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారిని ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి నియోజకవర్గంలో ఆయా ఎమ్మెల్యేలు, మంత్రుల సమక్షంలో ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల సమస్యలు పరిష్కరించడం జరుగుతుం దన్నారు. రాబోయే రోజులలో సమస్యల రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కొన్ని సమస్యలను సంబంధిత అధికారులకు ఫోన్ చేసి అక్కడికక్కడే పరిష్కరించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులతో గురుప్రసాద్

## జాతీయ స్థాయి పోటీల్లో 'జ్ఞానాంబిక' విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి-మదనపల్లె**

ఆలిండియా ఉడ్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి సీనియర్స్, జూనియర్స్ టోర్నమెంట్లో శ్రీజ్ఞానాంబిక కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరచి ఆలిండియా స్థాయిలో రన్నరప్ నిలిచారని కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురు ప్రసాద్ తెలిపారు. మహారాష్ట్రలోని నాగపూర్ స్టేడియలో ఈ నెల 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఆలిండియా ఉడ్బాల్ టోర్నమెంట్ నిర్వహించారుని తెలిపారు. ఈ పోటీల్లో 28 రాష్ట్రాల నుంచి పురుషులు, మహిళల జట్లు పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో మహారాష్ట్ర జట్టు విజేతగా నిలవగా, ఆంధ్ర జట్టు రన్నరప్‌గా నిలిచిందన్నారు. తమ కళాశాలకు చెందిన నలుగురు పురుషులు, నలుగురు మహిళలు రాష్ట్ర ఉడ్బాల్ జట్టుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనపరచిన తమ విద్యార్థులు ఆలిండియా ఉడ్బాల్ ఆసోసియేషన్ అధ్యక్షుడు ఆబిషిత్ దేశముఖ్ చేతుల మీదుగా రన్నరప్ షీల్డ్ అందుకున్నారన్నారు. క్రీడాకారులను ప్రిన్సిపల్ రమాదేవి, పీడీలు శరత్నాయక్, జగదీష్‌ను అభినందించారు.

## ప్రభుత్వాస్పత్రిలో నర్సుల బదిలీ నిలిపివేత

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు, ఇద్దరు ఆఫీస్ క్లర్కుల బదిలీ ఉత్తర్వులను నిలిపివేస్తూ రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రిలో మెడికల్ కాలేజ్ ప్రారంభం నిమిత్తం ఇక్కడ కొత్త వారిని నియామకం చేశారు. అయితే 2025లో మెడికల్ కాలేజ్ ప్రారంభం కాకపోవడంతో ఇక్కడ పనిచేస్తున్న వారిని బదిలీ చేశారు. అందులో భాగంగా సీనియర్ హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు ఇద్దరు ఆఫీసు సిబ్బందిని కలిపి మొత్తంగా 26 మందికి గతంలో బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. వీరందరూ మార్చి 31న రిలీవ్ కావాల్సి ఉంది. అయితే ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది కొరత చాలా ఉండడంతో ఇటీవల ఎన్నో ఆరోపణలు వెల్లువెత్తాయి. సిపిఎం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రజా సంఘాలు ధర్నా, రాస్తారోకా ల ద్వారా నిరసనలు తెలియజేశారు. దీనిపై మదనపల్లి ఎమ్మెల్యే రాష్ట్ర వైద్య శాఖ మంత్రితో చర్చలు జరిపారు. ఇక్కడ ఉన్న స్టాఫ్ ను ఇక్కడే ఉంచాలని చేసిన విజ్ఞప్తి మేరకు బదిలీ కావలసి ఉన్న 24 మంది స్టాఫ్ నర్సులు ఇద్దరు ఆఫీసు సిబ్బంది బదిలీ ఉత్తర్వులను రద్దు చేస్తూ వీరు మరో ఏడాది ఇక్కడే పని చేసేలా ఉత్తర్వులు జారీ చేశారు.

## హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

హత్య కేసులో నలుగురు నలుగురు ముద్దాయిలకు జీవిత ఖైదు శిక్ష ఒక్కొక్కరికి రూ.20 వేల జరిమానా విధిస్తూ మదనపల్లె రెండవ అదనపు జిల్లా జడ్జి అబ్రహమ్ తీర్పు వెలవరించారు. మదనపల్లె డిఎస్‌పి కొండయ్య నాయుడు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం చంద్ర కాలనీ చెందిన పూల వెంకట చలపతిని 2014లో కొందరు హత్య చేశారు. ఈ కేసులో హతుడి భార్య పూల జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రెండో పట్టణ పోలీసులు అప్పట్లో నిందితులైన ధనేశ్వర్‌రెడ్డి, రాంశెట్టి కిషోర్, అమర్నాథ్, దాసారు గంగాధర్, నాగ తాతగారి మల్లికార్జున, వలిగి సురేందర్ రెడ్డిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం కేసు విచారణ కొనసాగుతూ వచ్చింది. శుక్రవారం తుది విచారణలో నిందితులపై నేరారోపణ రుజువు కావడంతో శిక్షణ ఖరారు చేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ కేసులోని ఏ1 ముద్దాయి ధనేశ్వర్ రెడ్డి 2021 లో హత్య కాగా, ఏ3 ముద్దాయి గా ఉన్న అమర్నాథ్ 2017లో హత్య కాబడ్డాడు. మిగిలిన నలుగురు నలుగురు ముద్దాయిలైన రామిశెట్టి కిషోర్, దాసారు గంగాధర్, నాగ తాత గారి మల్లికార్జున, మలిగి సురేందర్ రెడ్డి లకు జీవిత ఖైదు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.20 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

## 'పది' పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

10వ తరగతి పరీక కేంద్రాలను శుక్రవారం జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు నరసింహులు, సావిత్రి బృందం తనిఖీ చేసింది. స్థానిక జడ్‌పి హైస్కూల్‌తో పాటు మరో 8 సెంటర్లలో వరుసగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. మండలంలో మొత్తం18 సెంటర్లలో 3,570 మంది విద్యార్థులు10వ తరగతి బయాలజీ సైన్స్ పరీక్షలు రాస్తున్నారు. కడపలో నెలకున్న ఇషఙ్యు కారణంగా, అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు తనిఖీలు ముమ్మరం చేశారని తెలిసింది.

## బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా అమరనాథ్‌రెడ్డి

**ప్రజాశక్తి-మదనపల్లె**

బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా సీనియర్ న్యావాదులు అమరనాథరెడ్డి, మనోహర్ విజయం సాధించారు. స్థానిక న్యాయవాదుల సంఘం భవన్‌లో శుక్రవారం బార్ అసోసియేషన్ ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. ఈ ఎన్నికలలో అధ్యక్షుడిగా బి.అమరనాథరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మనోహర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా ఎ.వి.శివకుమార్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా సోమశేఖర్ ఎంపికయ్యారు.12 మంది ఇసి మెంబర్లకుగాను 11 మంది ఏకగ్రీవం కాగా ఒక మెంబరు స్థానానికి జె.ఎస్.జస్వంత్ కృష్ణ, మహమ్మద్ రఫీలు పోటీపడ్డారు. జె.ఎస్.జస్వంత్ కృష్ణ 115 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మహిళ ప్రతినిధిగా ఎ.సుజాత విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 243 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు.న్యాయవాదులకు అన్ని విధాల అండగా ఉంటానని, వారి హక్కుల సాధన కోసం ఎల్లప్పుడు ముందుంటానని స్పష్టం చేశారు.అదేవిధంగా తన విజయానికి సహకరించిన న్యాయవాదులకు క ృతజ్ఞతలు తెలియజేసారు.తనతోపాటు బార్ అసోసియేషనుకు ఎంపికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు.

# ఎఎంసిలకు చైర్మన్ల నియామకం

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల కోలాహలం కొనసాగుతోంది. రాష్ట్రంలోని కూటమి సర్కారు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా 47 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్లను నియమించింది. వైఎస్ఆర్ జిల్లాకు ఒకటి, అన్నమయ్య జిల్లాకు మూడు పదవులను కేటాయించింది. వైఎస్ఆర్ జిల్లాలోని మైదుకూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మైదుకూరుకు చెందిన అందె పాపయ్యగారి వెంకటరవీంద్ర నియమించారు. అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గ పరిధిలో ముగ్గురు టిడిపి కేడర్‌కు పదవులు దక్కాయి. కలికిరి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మాలతి, పీలేరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పి.రామమూర్తి, వాల్మీకిపురం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కె.చంద్రమౌళిని నియమించారు.

### మార్కెట్ కమిటీని అభివృద్ధి చేస్తా : చంద్రమౌళి

కోసూరి చంద్రమౌళి

**వాల్మీకిపురం:** మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కోసూరి చంద్రమౌళిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. పట్టణానికి చెందిన చంద్రమౌళి తండ్రి కోసూరి నరసింహులు సైతం గతంలో మూడు పర్యాయాలు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, సింగల్ విండో అధ్యక్షుడిగా పనిచేసి పలు పదవులను అలంక రించారు. దశాబ్దాల రాజకీయంలో నల్లారి కుటుంబానికి అత్యంత సన్నిహితంగా ఉంటూ వస్తున్నారు. మాజీ సిఎం నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డికి అత్యంత సన్నిహితంగా కోసూరి కుటుంబం మెలుగుతోంది. చంద్రమౌళి 2013 నుంచి మూడు పర్యాయాలు వాల్మీకిపురం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేయడంతో పాటు లాభాల బాటలో తీసుకెళ్లేందుకు తన వంత కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో తనకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రావడానికి కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మాజీ సిఎం నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

### రైతుల సమస్యల పరిష్కారానికి కృషి : మాలతి

మాలతి

**కలికిరి:** వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా టిడిపి మహిళా సీనియర్ నేత మాజీ జడ్‌పిటిసి మాలతి ఎన్నికయ్యారు. మండలంలోని పతేగడ పంచాయతీ తెల్లగుట్టపల్లికి చెందిన ఆమె 20 సంవత్సరాలుగా పార్టీకి ఎన్నో సేవలు అందించారు. పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశారు. జడ్‌పిటిసిగా పని చేసిన అనుభవం ఉన్నందున ఆమెకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఆదేశాలు మేరకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మార్కెట్ కమిటీని కూడా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నం చేస్తానని చెప్పారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### రైతుల సంక్షేమమే ధ్యేయం : రామమూర్తి

పురం రామమూర్తి

**పీలేరు:** పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పురం రామమూర్తి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి పాటుపడుతూ కష్ట కాలంలోనూ నాయకుడికి వెన్నుదన్నుగా నిలిచానని పేర్కొన్నారు. పార్టీ ప్రతి కార్యక్రమంలోనూ చురుగ్గా పాల్గొంటూ అహర్నిశలు పార్టీని కాపాడుకుంటూ గుర్తింపు తీసుకొచ్చినందుకు కృషి చేశానని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు బాధ్యతగా రైతు సంక్షేమం, అభివృద్ధికి, మార్కెట్ యార్డుల అన్నదాతలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించిన అధిష్టానానికి, పార్టీ పెద్దలకు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియాజేశారు.

# మున్సిపల్ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

### - సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలు రవికుమార్ కోరారు. శుక్రవారం ఎన్‌జిఒ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మున్సిపల్ కార్మికులందరూ రాష్ట్రవ్యాప్తంగా ఆక్వాస్ విధానంలో పనిచేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ విధానాన్ని రద్దు చేసి పాత కాంట్రాక్టు విధానాన్ని కొనసాగించాలనే నిర్ణయం తీసుకోవడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. కాంట్రాక్టు విధానం వల్ల కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదని తెలిపారు. వెంటనే కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులు ప్రజల కోసం తమ ఆరోగ్యాన్ని కూడా లక్ష్య చేయక పని చేస్తారని చెప్పారు. అలాంటి వారిని 60 సంవత్సరాలు దాటిన కార్మికులను తొలగించాలన్న ప్రభుత్వ నిర్ణయం సరైనది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని తక్షణం పరిశీలించి కార్మికులు ఎంత కాలం పని చేయగలిగితే అంతకాలం వారిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ, కోశాధికారి లక్ష్మీదేవి, రాజంపేట డివిజన్ నాయకులు కె.ప్రసాద్, ఎం.వి.రమణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చిట్వేలి రవికుమార్

## కవులకు ఘన సన్మానం

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

విశ్వావసు నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని నెల్లూరుకు చెందిన కేంద్ర ప్రభుత్వ ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం వారు నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనంలో అన్నమయ్య జిల్లాకు చెందిన కవి పండితులు పాల్గొని కవితలు వినిపించి ఘన సన్మానం అందుకున్నారు. నెల్లూరు సమీపంలోని వెంకటాచలంలో ఏర్పాటైన ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ పర్యవేక్షణలో శుక్రవారం శతాధిక కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన ప్రముఖ తెలుగు పండితులు, కవి, రచయిత గంగనపల్లి వెంకటరమణ, చిత్రలేఖన ఉపాధ్యాయుడు, ప్రముఖ ఇంద్రజాలికుడు యుపి రాయుడు, చిట్వేలుకు చెందిన ఉపాధ్యాయులు దొండ్ల వాగు శ్రీనివాస్, తాళ్లపాక గ్రామానికి చెందిన బాలరాజు జనార్దన్ రాజు తమ కవితలను వినిపించారు. ఇందులో గంగనపల్లి వెంకటరమణ ఉగాది లక్ష్మికి స్వాగతం శుభ స్వాగతం అంటూ కవితా గానం చేశారు. ఓ మనిషీఇక మిగిలేదేముంది? చెప్పేదేముంది? అంటూ యుపి రాయుడు గేయ కవిత, ఒక్క వాన పేరుతో చిట్వేలుకు చెందిన ఉపాధ్యాయులు దొండ్లవాగు శ్రీనివాస్, ఉగాది ఆకాంక్షలు పేరుతో బాలరాజు జనార్దన్ రాజులు ఆలపించిన కవితలు ప్రేక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా కార్యక్రమానిర్వాహకులు శాలువా, ప్రశంసా పత్రం, జ్ఞాపికలతో కవులను ఘనంగా సత్కరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న పీడీ కిరణ్ కుమార్

## మెప్మా బలోపేతానికి కొత్త పథకాలు : పీడీ

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

మెప్మా, ఎస్ఎస్‌సి గ్రూపుల బలోపేతానికి కూటమి ప్రభుత్వం ప్రతిష్టమైన చర్యలు తీసుకుంటోందని, ఏప్రిల్ మొదటి వారంలో మరిన్ని కొత్త పథకాలను ప్రవేశపెట్టనున్నట్లు అన్నమయ్య జిల్లా మెప్మా పీడీ కిరణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం మదనపల్లె మెప్మా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌జి గ్రూపులు, ఆర్పీలతో నిర్వహించిన సమావేశానికి పీడీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా సభ్యులను చేర్చుకోవాలని తెలిపారు. 10 మంది కంటే తక్కువ ఉన్న గ్రూపులలో కొత్త సభ్యులను చేర్పించాలని పేర్కొన్నారు. పురుషులతో సంఘాలను ఏర్పాటు చేసి ఎస్ఎస్‌జిలను బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, మదనపల్లి మెప్మా అధికారి మధుసూదన్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని నిరసన

**ప్రజాశక్తి-పీలేరు**

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని కోరుతూ పీలేరులో ముస్లిం మత పెద్దలు నిరసన తెలిపారు. అల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పట్టణంలోని అన్ని మసీదుల్లో శుక్రవారం నల్ల రిబ్బన్లతో ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింల హక్కులకు తీవ్ర నష్టం కలగనుందని పేర్కొన్నారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ఇది ప్రమాదకరమని పేర్కొన్నారు. వక్ఫ్ ఆస్తులు ముస్లిం సమాజానికి చెందినవని తెలిపారు. వాటిపై ఏ విధమైన ప్రభుత్వ జోక్యం సహించబోమని స్పష్టం చేశారు. ఈ బిల్లుతో ముస్లిం మైనారిటీ హక్కులు హరించి పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జామియా మస్జిద్ ముత్తవల్లి అల్లాఉద్దీన్, హజరత్ ముక్తి, అబ్దుల్లా, షేక్ షాకీర్, ఆబిద్, ఉబేదుల్లా, దావుద్, ఖాజా, రాజకీయాలకతీతంగా పెద్ద సంఖ్యలో ముస్లిం యువత, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న ముస్లిం పెద్దలు

# 'కూటమి ప్రభుత్వంలోనే చేనేతల ఆకలి చావులు'

మాట్లాడుతున్న విజయ భాస్కర్

**ప్రజాశక్తి-రాయచోటి**

కూటమి ప్రభుత్వంలో బిసిలకు మొండిచేయి చెబుతున్నారని, చంద్రబాబు నాయుడు మొదటి నుంచి బిసిల పార్టీ తెలుగుదేశం పార్టీ అని చెప్పి వారిని అన్ని రంగాల్లో ఆర్థికంగానూ రాజకీయంగాను వారిని అణగదొక్కుతున్నది కూటమి ప్రభుత్వమని వైసిపి బిసి సెల్ అధికార ప్రతినిధి సిబ్యాల విజయ భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం వైసిపి జిల్లా పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి వైయస్సార్ ప్రభుత్వంలో ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24 వేలు ఇచ్చి అన్ని విధాల వాళ్ళని ఆర్థికంగా ఆదుకున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలోనే కానీ కూటమి ప్రభుత్వం 200 యూనిట్లు వరకు కరెంట్ బిల్లు ఉచితమని చెప్పి చేనేతలను నిలువున మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. 200 యూనిట్ల కరెంటు బిల్లు కేవలం 800 నుంచి 900 రూపాయలు ఉంటుందని చెప్పారన్నారు. కానీ ఈరోజు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి యూనిట్ పైన మళ్లీ ఒక్క రూపాయి పెంచిందన్నారు. పెంచిన బిల్లుతో కూడా వెయ్యి రూపాయలు నుంచి 1100 రూపాయలు లోపలనే ఉంటున్నదని తెలిపారు. ఏడాదికి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.24 వేలు ఇచ్చి చేనేతలకు చేయూతను ఇచ్చి అండగా నిలిచింది వైయస్సార్ ప్రభుత్వమన్నారు. ఈరోజు చంద్రబాబు నాయుడు కేవలం వారి ఏడాదికి రూ.10 వేలు ఇస్తే వారిని ఏడాదికి రూ.14 వేలు ఇవ్వకుండా మోసం చేయడానికి సిద్ధమైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం జగన్ ప్రభుత్వంలో ఒక నెలకు రూ.2 వేలు ముడిసరుకులకు గిట్టుబాటుగా వచ్చేదన్నారు. కూటమి ప్రభుత్వంలో నెలకు రూ.900 నుంచి వెయ్యి లోపే చేనేతలకు ఇస్తే చేనేతలను నిలువున మోసం చేయడానికి సిద్ధమవుతున్నది పేర్కొన్నారు. కుటుంబం ప్రభుత్వం ఇకనైనా జగనన్న ప్రభుత్వం మాదిరి ఏడాదికి రూ.24 వేలు ఇచ్చి చేనేత కుటుంబాలకు 200 యూనిట్ల కరెంటు బిల్లు ఉచితంగా ఇవ్వాలని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామని పేర్కొన్నారు. చేనేతలపైన చేనేతర వస్త్రాలపై జిఎస్‌టి ఎత్తివేసి చేనేత కళాకారులకు అన్యాయం జరగకుండా చూడాలనిమ తెలిపారు. బిసిలను దూరం దూరం పెడుతూ పదవుల పందారంలో కుల వివక్షతతో అగ్రవర్ణ కులాలకు అగ్రపీఠం వేసి బిసిలను కాలి కింద చెప్పులుగా చూడవద్దని హెచ్చరించారు. బిసిల పార్టీ తెలుగుదేశం పార్టీ అనే ఆనాడు ఊరగొట్టి నేడు బిసి కులం కులమైన చేనేత కళాకారుల తెలుగుదేశం పార్టీ మాయమాటలు నమ్మి 75 లక్షల ఓట్లు పూర్తిగా తెలుగుదేశం పార్టీకి వేశారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీల గెలుపు కారణమైందని చెప్పారు. ఎనిమిది శాతం ఓట్లు లేదా 13 లక్షల ఓట్లు వైసిపికి వేసి ఉంటే మీరు మీ తెలుగుదేశం పార్టీ ఘోరంగా ఓడిపోయి ఉండేవారని గుర్తుచేశారు. మీరు చేనేతకు చేనేత పరిశ్రమకు చేనేత కళాకారులకు అన్యాయం చేస్తే 2019లో వచ్చిన అన్ని సీట్లు కూడా మీకు రావని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. మూడు పార్టీలు కాదు 30 పార్టీలు ఏకమైన వచ్చిన వైసిపిని ఓడించలేరని తెలిపారు. ఏకంగా 40 శాతం ఓట్లు వైసిపి వారికి ఉన్నవి గమనించండి ఆ ప్రకారం మీరు భవిష్యత్తులో నిర్లక్ష్యం చేస్తే మీరు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు జానం రవీంద్ర యాదవ్, జిల్లా బిసి సెల్ మాజీ ఉపాధ్యక్షులు రేపన సంజీవయ్య, బిసి నాయకులు పాల్గొన్నారు.

పరీక్ష రాసేందుకు ఆటోలో వచ్చిన విద్యార్థి రెడ్డెయ్య

## గాయాలతోనే పరీక్షకు విద్యార్థి హాజరు

**ప్రజాశక్తి-పుల్లంపేట**

మండలంలోని పివిజిపల్లెకు చెందిన పదవ తరగతి విద్యార్థి వెలగచర్ల రెడ్డెయ్య ద్విచక్ర వాహన ప్రమాదానికి గురై కాలికి తీవ్రగాయమైంది. ప్రమాదంలో కాలికి తీవ్రగాయమైనప్పటికీ శుక్రవారం ఆదర్శ పాఠశాలలో పదో తరగతి పరీక్షకు హాజరయ్యాడు. గాయాలపాలినప్పటికి పరీక్ష రాసేందుకు ఆటోలో వచ్చిన రెడ్డెయ్యను పలువురు ప్రశంసించారు.

## భూ సరిహద్దులు చూపాలి

**ప్రజాశక్తి-పుల్లంపేట**

దళిత, గిరిజన, ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన పట్టా, పాస్ బుక్కులను ఆన్‌లైన్ చేసి భూమి సరిహద్దులు చూపించాలని బికెంఎయు అధ్యక్షులు పండుగోల మణి, నియోజకవర్గ కార్యదర్శి ఎం.జయరామయ్య పేర్కొన్నారు. శనివారం ఓబుల వారిపల్లి తహశీల్దార్ శ్రీధర్‌రావుకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో భూమిలేని నిరుపేద దళిత గిరిజన, ముస్లిం మైనారిటీలకు పట్టా పాస్ బుక్కులు ఇచ్చినప్పటికీ ఐదేళ్లు గడుస్తున్నా ఆన్‌లైన్ చేసి భూమి సరిహద్దులు చూపించడంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి భూహక్కుదారులకు సరిహద్దులు చూపించి నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిటి రెడ్డిప్రసాద్, దళితులు, గిరిజనులు పాల్గొన్నారు.

## నేడు గంగాపురంపల్లెలో సివిల్ రైట్స్ డే

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

మండలంలోని నిమ్మనపల్లె పంచాయతీలోని గంగాపురంపల్లెలో శనివారం పౌర హక్కుల పరిరక్షణ దినోత్సవ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ కె.అమర్నాథ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెల 30న క్రమ పద్ధతిలో మండలంలోని ఒక గ్రామంలో పౌర హక్కుల పరిరక్షణ దినోత్సవ సమావేశాన్ని నిర్వహిస్తూ, వారి సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నామని అన్నారు. ఈ క్రమంలోనే మార్చి 29న ఉదయం గం.11.30లకు గంగాపురంపల్లెలో సివిల్ రైట్స్‌డే సమావేశం ప్రారంభమవుతుందని, అన్ని శాఖల మండల అధికారులు, సంబంధించిన నాయకులు సమావేశానికి తప్పక హాజరు కావాలని అన్నారు.

## నేటి నుంచి శ్రీచౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

శ్రీచౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు శనివారం నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఘనంగా జరుగుతాయని శ్రీచౌడేశ్వరిదేవి ఆలయ కమిటీ, జ్యోతి ఉత్సవ ఆహ్వాన కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం కమిటీ ఆధ్వర్యంలో జ్యోతి ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు పురాణం చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి బండి పవన్‌కుమార్, కోశాధికారి రామిశెట్టి రత్నమయ్య, గౌరవ అధ్యక్షులు మోడెం వెంకటరమణ, గౌరవ ఉపాధ్యక్షులు మోడెం సిద్ధప్ప మాట్లాడుతూ శనివారం అమ్మవారు వెండి అలంకరణ దర్శణం, దీలు మోయుట, ఆదివారం రాత్రి విద్యుత్ దీపాలు, బ్యాండ్ మేళాలు, పిల్లన గ్రోవి వాయిద్యాలు, కాట్పాడి నాయాండి నృత్యాలు చెక్కభజనలు, వానం బాడీ డ్రమ్స్ నడుమ సింహవాహనం పై అమ్మవారు పుష్పపల్లకిలో ఊరేగింపు, జ్యోతి ఉత్సవం జరుగుతాయన్నారు. సోమవారం తోగట వీర క్షత్రియ సంఘంచే చలివేంద్రం ఏర్పాటు, ఉట్ల తిరునాల, మంగళవారం జ్యోతి ప్రసాద వినియోగం, అమ్మవారి లడ్డు, చీరలు నాణెముల వేలం ఉంటుందని వెల్లడించారు.

గ్రాడ్యుయేషన్ పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపల్

## శ్రీచైతన్యలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

భువనగిరిపల్లె ఆర్చి వద్ద గల శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం ప్రాథమిక స్థాయి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ప్రిన్సిపల్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అహుతులను అలరించాయి. ఈ సందర్భంగా ఎజిఎం రమణయ్య, ప్రిన్సిపల్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని ఉన్నత విద్యలోకి అడుగిడుతున్న సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రాథమిక విద్యలో రాణించి నట్లే ఉన్నత విద్యలోనూ చక్కగా రాణించి గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పత్రాలు అందించారు. కార్యక్ర మంలో ప్రైమరీ ఇన్‌ఛార్జి దీపిక, ఉపాధ్యాయులు హరిబాబు, తస్లీమ్, నందిని, రాజేశ్వరి పాల్గొన్నారు.

## నిఘా నీడలో 'పది' పరీక్షలు

**ప్రజాశక్తి-చిట్వేలి**

మండల పరిధిలోని స్థానిక జడ్‌పి హైస్కూల్‌లో పదవ తరగతి పరీక్షలకు 639 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలు రాసే సమయంలో పాఠశాల ఆవరణలో పోలీసు శాఖ వారు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో పరీక్షలు రాసేందుకు స్థానిక పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రఘురాం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికులకు రంజాన్ తోఫా పంపిణీ

**ప్రజాశక్తి-కలికిరి**

పట్టణానికి చెందిన షేక్ హమీజాబీ గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు రంజాన్ పండుగను పురస్కరించుకొని శుక్రవారం బియ్యం, దస్తులు, ఆర్థిక సహాయం వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంజాన్ మాసంలో మహమ్మద్ ప్రవక్త ఆదేశానుసారం తన సంపాదనలో కొంత భాగం జకాత్ రూపంలో పేదలకు అందించడం తనకు ఆనందంగా ఉందని తెలిపారు. రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ దాన ధర్మాలు చేస్తారని అన్నారు. నెలరోజుల పాటు ఉపవాసం ఆచరిస్తామని తెలిపారు. ఈ పండుగ ఆనందరూ సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

కార్మికులకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న షేక్ హామీజ

# ఎరువుల వాడకంపై రైతులకు శిక్షణ

**ప్రజాశక్తి-రైల్వేకోడూరు**

భూ ఆరోగ్య ఫలితాల ఆధారంగా భూసార పరీక్షా కేంద్రం సూచించిన విధంగా ఎరువులు వినియోగిస్తే ఆ భూమి ఆరోగ్యం కాపాడుతూ ఎరువులపై ఖర్చులు తగ్గించుకొని అధిక దిగుబడులు పొందవచ్చునని ఎడిఎ కవిత పేర్కొన్నారు. రైతు సేవ కేంద్రంలో రైతులకు రైతు సేవ కేంద్రాల సిబ్బందికి భూ ఆరోగ్య ఫలితాలు పత్రం ఆధారంగా పంటలకు ఎరువుల విని యోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతు సేవ కేంద్రాల్లో పని చేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు 2024-25 సంవత్సరంలోని 920 మంది రైతులకు ఫలితాల ఆధారంగా రైతులచే వేయించి అధిక దిగుబడును కృషి చేయాలని ఆదేశించారు. మం డల వ్యవసాయ అధికారి జి.సుధాకర్ మాట్లాడుతూ భూ ఆరోగ్య ఫలితాలు పత్రం ఆధారంగా ఏ విధంగా ఎరువులు వినియోగించాలో రైతు సేవ కేంద్రం సిబ్బందికి తెలిపారు. ఉద్యానశాఖ అధికారి ఎం.భాస్కర్ మాట్లాడుతూ ఉద్యాన పంటలు ఎరువుల వినియోగంపై రైతులకు వివరించారు.కార్యక్రమంలో మండలంలోని రైతు సేవ కేంద్రాలలో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు ,గ్రామ ఉద్యాన సహాయకులు రైతులు పాల్గొన్నారు. **పుల్లంపేట** :మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకర్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎఒ మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రతి రైతు వారి పొలంలో భూసార పరీక్షా ఫలితాలు చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. భూసార పరీ క్షను బట్టి పొలంలో ఎంత మోతాదులో ఎరువులు వినియోగం చేసుకోవాలో తెలు స్తుందని తెలిపారు. ప్రస్తుతం రైతులు ఎరువులు, పురుగుల మందులు విచక్ష ణారహితంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. నేల, గాలి, నీటి కాలుష్యంతో పాటు సాగు ఖర్చులు పెరిగి రైతులకు నికర ఆదాయం తగ్గుతున్నట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులపై రైతులు అవగాహన కలిగి ఉండి రసాయనిక ఎరువులు, పురుగుల మందుల వినియో గం తగ్గించాలన్నారు. సిఫారసు మేరకే ఎరువులు, పురు గుల మందులు వాడాలని సూచించారు. సేంద్రీయ ఎరువులు, జీవన ఎరువులు, జీవ సిలింద్ర నాసినులు, వేప కషాయం లేదా వేప నూనె లాంటి ప్రకృతి వనరులను వినియోగించడంతోపాటు మేలైన యాజమాన్యం పద్ధతులు పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చు కోవాలని అన్నారు. మట్టి నమూనా తీసే విధానం, మట్టి పరీక్ష ఫలితాలను అను సరించి ఎరువుల వినియోగం సమస్యాత్మక భూముల యాజమాన్యం గురించి వివరిం చారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్ర సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మస్తాన్, రైతులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : రైతులకు భూ ఆరోగ్య పత్రాలను అందిస్తున్న ఎడిఎ

## ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీధర్

**ప్రజాశక్తి-నందలూరు**

స్మాషర్స్ షటిల్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈనెల 30, 31వ తేదీలలో అన్నమయ్య, కడప జిల్లా స్థాయిలో షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ నాన్ మెడలిస్ట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎస్ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ నందలూరు రైల్వే కేంద్రంలోని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కార్యా లయంలో టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇందులో పాల్గొనేవారు ఈనెల 29వ తేదీ లోపల తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. మొదటి బహుమతి రూ.7 వేలు, రెండవ బహుమతి రూ.5వేలు, మూడవ బహుమతి రూ.3 వేలు, నాలుగవ బహుమతి రూ.2 వేలు, షీల్డ్‌లను ఇవ్వనున్నట్లు తెలిపారు. టోర్నమెంట్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మెడల్స్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్మాషర్స్ షటిల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో అక్రమాలకు తావులేదు

**ప్రజాశక్తి-రాయచోటి**

కూటమి ప్రభుత్వంలో అక్రమాలకు,అవినీతికి, కబ్జాలకు, దౌర్జన్యాలకు తావు లేదని మండల మాజీ ఉపాధ్యక్షులు అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల్లో వస్తున్న విశేష స్పందన చూసి ఓర్వలేని వైసిపి నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.ఇందులో భాగంగానే కూటమి ప్రభుత్వం ఇటీవల నామినేటెడ్ పదవులను ప్రకటిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం నుంచి తనకు సానుకూల స్పందన లభిస్తున్న తరుణంలో తనపై బురదజల్లే ప్రయత్నంలో భాగంగా డాక్టర్ రెడ్డప్పరెడ్డికి సంబంధించిన భూమిని కూటమి నేతలు కబ్జా చేస్తున్నారంటూ తమపై సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలు చేస్తుండడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.కబ్జాలకు అక్రమాలకు కేరాఫ్ వైసిపి ప్రభుత్వం అని ప్రజలు వైసిపి ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకున్న విషయం జీర్ణించుకోలేని వైసిపి నేతలు ఉనికి కోసం ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా వైసిపి నేతలు సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలు మానుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. అనంతరం మున్సిపాలిటీ స్థలాన్ని ఆక్రమించారంటూ సోషల్ మీడియాలో వచ్చిన ఆరోపణలకు, మునిసిపల్ స్థలానికి తన భూమికి ఎటువంటి సంబంధం లేదని రాయచోటి మండల పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామం నక్కవాండ్లపల్లికి చెందిన డాక్టర్ రెడ్డప్పరెడ్డి పేర్కొన్నారు.తాను తిరుపతిలో ప్రాక్టీస్ చేసుకుంటూ నివాసం ఉంటున్నానని, టిడ్కో ఇండ్లకు పక్కనే సర్వేనెంబర్ 649/1 లో ఉన్న స్థలం తన భార్య పాపిరెడ్డి రమణమ్మ పేరుతో ఉందన్నారు. ఆ భూమికి టిడ్కో ఇండ్లకు ఇచ్చిన భూమికి ఎటువంటి సంబంధం లేదనే విషయాన్ని మున్సిపల్ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులు ధ్రువీకరించిన ఆధారాలు కూడా తన వద్ద ఉన్నాయని అన్నారు. తన భార్య పేరుతో ఆ భూమికి సంబంధించిన పాస్ పుస్తకం కూడా ఉందని తెలిపారు. మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేశారని చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, నా భూమిని ఎవరూ కబ్జా చేయలేదని వివరించారు. అవసరమైతే ఎవరైనా వచ్చి తన వద్ద ఉన్న రికార్డులు చూసుకోవచ్చని, విచారించుకోవచ్చుననితెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు రామ చద్ర, రామచంద్రయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాంప్రసాద్‌రెడ్డి

## ప్రతి ఒక్కరికీ మంచి జరగాలి : మంత్రి 'మండిపల్లి'

ఇఫ్తార్ విందులో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్, మైనార్టీ నాయకులు

**ప్రజాశక్తి-రాయచోటి**

పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం సాయంత్రం రాయచోటి పట్టణంలోని ఫ్రూట్స్ మండీల ఆవరణంలో రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సర్వమతాల సారాంశం ఒక్కటేనని, ఉపవాస దీక్షలు, ఆరాధన ప్రార్థనలు, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందించడమే రంజాన్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మైనార్టీ సోదరులు ఈ మాసాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున నేడు ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నదన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో రంజాన్ పవిత్రతను గుర్తించి అల్లా అనుసరించిన మార్గంలో నడవాలన్నారు. రాబోయే రోజులలో హిందూ, ముస్లిం సోదరులు కలిసిమెలిసి జీవించి అన్నమయ్య జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో 30 రోజులుగా ముస్లిం సోదరులు ఎంతో భక్తి శ్రద్ధలతో ఉపవాసం ఉండి మూడు పూటలా నమాజ్ చేసుకోవడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఈ రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని అల్లాను ప్రార్థిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఇఫ్తార్ విందుకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## నారా భువనేశ్వరిని కలిసిన కెకె

**ప్రజాశక్తి-చిట్వేలి**

కుప్పం పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని రాష్ట్ర ఖాది, గ్రామీణ పరిశ్రమల శాఖ చైర్మన్ కెకె చౌదరి శుక్రవారం కుటుంబ సమే తంగా కలిశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ భువనేశ్వరి మా కుటుంబం పై చూపి న ఆదరాభిమానాలు మరువలేనివని ఆనందం వ్యక్తం చేశారు. ఆమెతో పాటు నిజం గెలవాలి కార్యక్రమంలో పాల్గొన్న రోజులు నా జీవితంలో తీపి జ్ఞాపకాలుగా మిగిలిపోతాయని అన్నారు.

భువనేశ్వరితో కకె చౌదరి కుటుంబం

## పాస్టర్ మృతిపై విచారణ చేపట్టాలి

**ప్రజాశక్తి - కడప**

పాస్టర్ ప్రవీణ్ మృతి రోడ్డు ప్రమాదమా.... హత్యనా? విచారణ చేపట్టి అందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఎపిపిఎఫ్ జిల్లా అధ్యక్షులు మల్లెం విజయభాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పాత రిమ్స్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్ రాజమండ్రి ప్రాంతం హైవే రోడ్డు ప్రమాదంలో చనిపోయారని ఆ ప్రాంతపు పోలీసు వారు చెబుతున్నారన్నారని, ఇది రోడ్డు ప్రమాదం కాదు, హత్య జరిగిందని అక్కడి వారు మరోలా చెప్పారని చెప్పారు. పోలీసు వారు అన్ని కోణాల నుంచి పూర్తి స్థాయిలో విచారించి అనుమానితులను అదుపులోకి తీసుకోవాలన్నారు పాస్టర్ ప్రవీణ్ కడప జిల్లా వాసి అని, ఆయన మరణం తీవ్రమైన బాధ కలిగించిందని పేర్కొన్నారు. సమావేశంలో పాస్టర్లు విజయశేఖర్, రాజన్న, సత్యమయ్య, అలెక్స్ సురేష్, సందీప్ రాజ్, ఆనందరావు,బ్రదర్ లారెన్స్, పాల్గొన్నారు.

## రాష్ట్ర విభజనతో తెలుగు ప్రజలకు నష్టం

**-జాతీయ సదస్సులో చరిత్ర అధ్యాపకులు బాలకొండ గంగాధర్**

**ప్రజాశక్తి - కడప అర్బన్**

ఆంధ్రప్రదేశ్ విభజనతో తెలుగు ప్రజలకు తీవ్ర నష్టం ఏర్పడిందని చరిత్ర అధ్యాపకులు బాలకొండ గంగాధర్ అన్నారు. శుక్రవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లో భారతదేశ చరిత్రను మార్చిన సంఘటనలపై జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సులో వేంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకులు బాలకొండ గంగాధర్, తెలుగు శాఖ అధిపతి డాక్టర్ ఎల్ నాగ లక్ష్మి దేవి సంయుక్తంగా జాతీయ సదస్సులో 2014 తెలుగు ప్రజల చరిత్రలో ముఖ్య సంఘటనపై ప్రసంగించారు. కార్యక్రమానికి యూనివర్సిటీ డైరెక్టర్ ఆచార్య మురళీమోహన్ అధ్యక్షత వహించగా వీరు 2014 సంవత్సరం ఆంధ్ర ప్రజల భవిష్యత్తుకు, ఏ విధంగా దిక్కుచిగా మారిందో చెప్పారు. గంగాధర్ మాట్లాడుతూ రాష్ట్ర కేంద్రీకృత అభివృద్ధి, హైదరాబాదు ప్రాంతమే విపరీతంగా అభివృద్ధి చెంది ప్రపంచ దేశాలతో పోటీపడి ఆదాయాన్ని సంపాదించి పెట్టిందన్నారు. కనుక తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరారని చెప్పారు. ఈ విషయాన్ని నేడు అధికారంలో ఉన్న ప్రభుత్వాలు బాగా గమనించి రాష్ట్రమంతా సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరో ఏ ప్రాంతం ప్రత్యేక రాష్ట్రం కొరకు డిమాండ్ చేసే అభిప్రాయానికి రా నివ్వకూడదని తెలిపారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు సంబంధించిన మేధావులు అనేక విషయాలపై ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపల్ చరసాల యోగాంజనేయులు దీనిపై స్పందిస్తూ గంగాధర్ లాంటి లెక్చరర్లు ఏ కళాశాల కైనా ఒక ఆస్తిగా ఉంటారని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు బాగా ఆదర్శంగా ఉంటాయని కొనియాడారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, కంపెనీ ప్రతినిధులు

## ప్రాంగణ ఎంపికల్లో 10 మందికి ఉద్యోగాలు

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

మండలంలోని స్థానిక రంగ సముద్రం రోడ్డులో గల ఆదిత్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆల్ డిజి టెక్ బెంగళూరు, చెన్నై వారి సహకారంతో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవులో 60 మంది విద్యార్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, హెచ్.ఆర్ తదితర రౌండ్లు నిర్వహించగా పది మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందచేశారు. ఎంపికైన విద్యార్థులకు రూ.2.4 లక్షల వార్షిక వేతనం అందిస్తారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ బి.రాజేంద్ర నాయక్, హెచ్ఆర్. బాబా ఫక్రుద్దీన్,యాస్మీన్, ప్లేస్మెంట్ ఆఫీసర్స్ లోకేష్, మహబూబ్ బాషా అభినందించారు.

### జాబ్ మేళాలో ఏడుగురికి...

**తంబళ్లపల్లి** : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, సీడాప్, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో జాబ్ మేళాను స్థానిక శ్రీ టిఎన్ వెంకట సుబ్బారెడ్డి మెమోరియల్ గవర్నమెంట్ ఐటిఐలో నిర్వహించారు. స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ చౌడయ్య మాట్లాడుతూ జిల్లా లోని నిరుద్యోగ యువత ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాట్లాడుతూ ఇలాంటి జాబ్ మేళాలు ప్రతి నెల జిల్లాలోని ప్రతి ఒక్క నియోజకవర్గం లో జరుగుతుంది అని ప్రతి ఒక్కరూ ఈ జాబ్ మేళా లు వినియోగించాలని వివరించారు. ముతూట్ ఫైనాన్స్ నుంచి పి.పవన్ కల్యాణ్, హుండై బాంబిల్ నుంచి రవితేజ హజంయ్యారు. జాబ్‌మేళాకు 12 మంది అభ్యర్థులు హాజరు కాగా అందులో ఏడుగురు రూ.15 వేల నుంచి రూ.20 వేల వేతనంతో వివిధ కంపెనీలకు ఎంపికయ్యారని వివరిం చారు. కార్యక్రమంలో టిఒనాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## రేషన్ కార్డుదారులకు ఇకెవైసి తప్పనిసరి

**ప్రజాశక్తి-పుల్లంపేట** : మండల పరిధిలోని రేషన్ కార్డుదారులు ప్రతి ఒక్కరూ రేషన్ దుకాణాల వద్ద ఇకెవైసి తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తహశీల్దార్ అరవింద కిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ దుకాణాల వద్దకు వెళితే డీలర్లు ఇకెవైసి నమోదు చేసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇకెవైసి అప్‌డేట్ కాని వారు, ఐదు సంవత్సరాల లోపల పిల్లలు గ్రామ సచివాలయంలో వెళ్లి నమోదు చేసుకోవచ్చని సూచించారు. మార్చి 31వ తేదీ లోపు ఇకెవైసి నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

## పోలవరంపై నిర్లక్ష్యం తగదు : పిసిసి

**ప్రజాశక్తి - వేంపల్లె** : పోలవరంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు కాంగ్రెస్ పార్టీ మానస పుత్రిక అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే ఎప్పుడో పోలవరం పూర్తి అయి ఉండేదని చెప్పారు. బిజెపి ఒక శనిగ్రహంలా వైసిపి, టిడిపిలు పోలవరం ప్రాజెక్టు పాలిట రాహు కేతువులుగా దాపురించాయాని ఎద్దేవ చేశారను. ఎపికి పోలరం ప్రకృతి ప్రసాదించిన వరం అన్నారు. . పవిత్ర గోదావరి నది మీద ధవళేశ్వరం బ్యారేజ్‌కి ఎగువన 42కిలోమీటర్ల దూరంలో పోలవరం మండలం, రామయ్య పేట వద్ద ప్రాజెక్టు నిర్మిస్తున్నారని చెప్పారు. పోలవరం పూర్తి అయితే 7.20 లక్షల కొత్త ఆయకట్టుకు సాగునీరు,10.13లక్షల ఎకరాలకు స్థిరీకరణ, 540 గ్రామాలకు తాగునీరు, విశాఖ ఉక్కు కర్మాగారానికి నీరు, 960 మెగా వాట్ల జల విద్యుత్ ఉత్పత్తి, గోదావరి - కృష్ణా నదుల అనుసంధానం, జల రవాణా ఇలా బహుళ ప్రయోజనాలు ఉన్నట్లు చెప్పారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి మాటలు తగ్గించి కేంద్ర ప్రభుత్వ నిధులతో పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే ఎత్తు తగ్గించకుండా 150 అడుగుల ఎత్తున ప్రాజెక్టు నిర్మించి వీలైనంత త్వరగా పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

**ప్రజాశక్తి-ఖాజీపేట** : ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మాజీ మంత్రి డి.ఎల్ .రవీంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సాహిత్య డిగ్రీ కళాశాల 13వ వార్షికోత్సవ కార్యక్రమం యాజమాన్య ప్రతినిధులు సంజీవరెడ్డి, సాయిరాంరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి డిఎల్ రవీంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని, డిగ్రీ స్థాయిలోనే ఉన్నత లక్ష్యం వైపు దృష్టి సారించాలన్నారు. అనంతరం పాఠశాల యాజమాన్యం ప్రతినిధులు సంజీవరెడ్డి, సాయిరాం రెడ్డి మాట్లాడుతూ కళాశాల స్థాపించినప్పటి నుంచి ఉత్తమ ఫలితాలు సాధిస్తూ, ఆదర్శవంతమైన విద్యాబోధన సాగిస్తూ అగ్రగామి విద్యాసంస్థగా నిలిచిందని పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయ అనుబంధ సంస్థ అయిన సాహిత్య డిగ్రీ న్యాక్ బి ప్లస్ గ్రేడ్ అర్హత సాధించిందని, త్వరలో అటానమస్ హోదా దక్కనుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరింపజేశాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# క్రైం కార్నర్

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్రవాహన దారుడు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం వాల్మీకిపురం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణంలోని రెడ్డప్పనాయుడు కాలనీలో నివాసముంటున్న సురేష్ పేటియం కంపెనీలో పనిచేస్తాడు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి వాల్మీకిపురం మండలం చింతపర్తి లో జరుగుతున్న గుంటి గంగమ్మ జాతరకు బైకులో వెళ్లాడు. జాతర చూసుకుని అదే పంచాయతీలోని అయ్యావారిపల్లెలోని అత్తగారి ఇంటికి వెళుతుండగా, అయ్యావారిపల్లి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమ నించిన స్థానికులు బాధితున్ని చికిత్స కోసం వెంటనే మద నపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు. పరిస్థితి ఆందోళనకరంగా తిరుపతికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## వేటగాడు అరెస్టు : నాటు తుపాకీ స్వాధీనం

**ప్రజాశక్తి-చిట్వేలి**

నిందితుడు చంద్రమోహన్

నాటుతుపాకీతో అటవిజంతువులను వేటాడే బయలుదేరిన ఇద్దరు వ్యక్తులలో ఒకరి అదుపులోకి తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఎస్ఒ శ్రీనివాసులు తెలిపారు. అటవీశాఖ అధికారుల వివరాల మేరకు..అడవి జంతువులను వేటాడేందుకు ప్రయత్నిస్తు న్నారని ముందస్తు సమాచారం మేరకు అటవీశాఖ అధికారి ధీరజ్ సిబ్బందికి సమాచారం తెలిపారని అన్నారు. వెంటనే మండల పరిధిలోని చిట్వేలి-పుల్లంపేట ఘాట్ రోడ్డులో అం బుల వీరయ్య స్వామి దేవాలయం సమీప ప్రాంతంలో గురువారం రాత్రి సమయంలో జంతువులను వేటాడేందుకు నాటుతుపాకీతో బయలుదేరిన వెంకటగిరికి చెందిన చంద్రమోహన్, పొంతగిరి గంగాధర్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించగా గంగాధర్ పరారుకాగా, చంద్రమోహన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడికి శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించి రాజంపేట కోర్టులో ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవి జంతువులు వేటాడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని నిఘా కోసం ప్రత్యేక టీం ను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌బిఒ రమేష్, కరిముల్లా, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.